
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 3 మార్చి 2024





నూతన చట్టాలపై పోలీసులకు శిక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు : డిజిపి ఆదేశాల మేరకు మూడు సరికొత్త చట్టాలు అమలు తీరుపై అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసు సిబ్బందికి ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పి డాక్టరు కె. తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కళ్యాణ్ డ్యామ్ సమీపంలోని పోలీసు ట్రైనింగ్ కళాశాల నుంచి 6 జిల్లాల పోలీసు అధికారులకు ఈ శిక్షణ ఆరు రోజుల పాటు జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం గత నెల 26వ తేదీ నుంచి ఈ నెల 2వ తేదీ వరకు ప్రతి రోజు రెండు గంటల పాటు నిర్వహించినట్లు పేర్కొన్నారు. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన సుమారు 2,900 మంది పోలీసు అధికారులు సిబ్బంది తమ తమ కార్యాలయాలు, పోలీసు స్టేషన్ల నుండి తరగతులకు హాజరయ్యారన్నారు. హైదరాబాద్ కేంద్ర ప్రభుత్వ ట్రైనింగ్ సెంటర్లో వారం రోజులపాటు శిక్షణ పొందిన అధికారులచే తరగతులు ఉంటాయన్నారు.



శిక్షణకు హాజరైన పోలీసులు

'వేమిరెడ్డి' సేవలను గుర్తించే వచ్చా..!

- ఆయన రాకతో వైసిపి ఖాళీ అవుతోంది
- పదికి పది స్థానాలు మనవే ..
- టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు
- భారీగా జన సమీకరణ..పార్టీలో చేరికలు పేలవం

వైసిపికి, ఎంపి పదవికి రాజీనామా చేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. శనివారం నగరంలోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సభలో పార్టీ కండువా కప్పి, ఆహ్వానించారు. వేమిరెడ్డి రాకతో వైసిపి ఖాళీ అవుతోందని భారీ ఎత్తున ప్రచారం చేశారు. అతి కొద్ది మంది మాత్రమే పార్టీలో చేరారు. మిగిలిన వారు ఊరు పేరు లేదని విమర్శలు వస్తాయి, ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు ఆయన వెంట వస్తారని ప్రచారం జరిగినా ఆ పరిస్థితులు ఏమీ కనిపించలేదు. వేమిరెడ్డి అభిమానులు, టిడిపి శ్రేణులు భారీ జనసమీకరణ చేశారు. ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డైడ్ లాగా సభ విజయవంతమైనా, ఆయన వెంట వచ్చిన నేతలు అతి కొద్ది మంది మాత్రమే కావడం విశేషం..



చంద్రబాబునాయుడు సమక్షంలో టిడిపిలో చేరిన 'వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ' దంపతులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాకతో జిల్లాలో వైసిపి ఖాళీ అవుతుందని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. మంచి వ్యక్తి, సమాజసేవ పరమావదిగా పనిచేసే ప్రభాకర్‌రెడ్డి రాజకీయాల్లో సేవ చేయడానికి మాత్రమే వస్తున్నారన్నారు. కేవలం అందుకోసమే విజయవాడ నుంచి నెల్లూరు వచ్చి ఆయనను పార్టీలోకి గౌరవంగా ఆహ్వానిస్తు న్నామన్నారు. అందరూ విజయవాడ వచ్చి పార్టీలో చేరితే, నేను నెల్లూరు వచ్చి వేమిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటున్నానంటేనే ఆయన ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. వైసిపిలో ఇమడలేకనే రాష్ట్ర వ్యాపితంగా నేతలు టిడిపిలో వస్తున్నారన్నారు. నెల్లూరు ఎంపిగా భారీ మెజార్టీతో వేమిరెడ్డి గెలుపు ఖాయమైందని చెప్పారు. నెల్లూరు జిల్లాలో గత ఎన్నికల్లో వైసిపికి పదికి పది స్థానాలు ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి పదికి పది స్థానాలు ఇవ్వాలన్నారు. నెల్లూరు జిల్లాలోని వైసిపిపై తిరుగుబావుటా ఎగురవేశారని, అందుకే ముగ్గురు ఎంఎల్‌ఎ టిడిపితో వచ్చారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రమంతా తిరుగుతూ సిద్ధమా అంటున్నారని, ఇంటికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారా అని అన్నారు. నా రాజకీయ జీవితంతో ఇలాంటి ముఖ్య మంత్రిని చూడలే దన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వినాశనం చేశా'రన్నారు. జగన్ ఇంటికి లేదా జైలుకో వెళ్లడానికి సిద్ధంగా ఉండాల న్నారు. చెల్లినీ కూడా న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్రానికి న్యాయం చేస్తారా? అని ప్రశ్నించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన నాడు తనపై నింద వేశారని, ఇప్పటి వరకు దాని విషయం ఎందుకు మాట్లా డడం లేదన్నారు. జగన్‌కు ఓటు వేయొద్దని ఆయన కుటుంబ సభ్యులే చెబు తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు న్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే జనసేన, టిడిపి పొత్తు పెట్టుకుం దన్నారు. రాష్ట్ర వ్యాపితంగా వైసిపి విధానాలు నచ్చక పార్టీ మారుతు న్నారన్నారు. ఇప్పటికే ఆరుగురు ఎంపిలు పార్టీ మారారన్నారు. నెల్లూరు జిల్లా రాజకీయాలు రాష్ట్రంలోనే ప్రత్యేకంగా ఉంటాయని, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టిడిపిలో చేరడం అభినం దనీయమన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన



చంద్రబాబుకు స్వాగతంపలుకుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పి. నారాయణ

ప్రభుత్వం రావడం వెయ్యి శాతం ఎప్పుడో ఖరారైం దన్నారు. నెల్లూరు జిల్లాలో పదికి పది స్థానాలు గెలుచుకుంటామని, పులివెందుల తోపాటు, మంచి మెజార్టీ వస్తుందని నమ్మకం ఉందన్నారు. వైసిపి నుంచి టిడిపిలోకి ఎందుకు నేతలు వస్తున్నారో గుర్తించు కోవాలన్నారు. పార్టీ నేతలు, జనసేన, అందరినీ బాగస్వాములు చేసుకుంటానన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ జగన్ మోహన్‌రెడ్డి బాధితు లేనన్నారు. రాష్ట్ర ప్రజలు ఇప్పుడు క్వాట్ జగన్ నినాదంతో పనిచే యాలన్నారు. కేవలం 40 రోజులు మాత్రమే సమ యం ఉందని, ప్రతి ఒక్కరూ కసిగా పనిచే యాల్సిన అవసరం ఉందన్నారు. కొందరు అధి కారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే, జగన్ తోపాటు జైలుకు వెళ్లడం తప్పదని హెచ్చరించారు.

సభ ఘనం..చేరికలే పేలవం..!

రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు టిడిపి నేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేశారు. కనుపర్తిపాడు రోడ్ల నుంచి విపిఆర్ కన్వెన్షన్ వరకు పసుపు మయ మైంది. వేమిరెడ్డితోపాటు ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్ ఎలు, వైసిపిలో పెద్ద ఎత్తున పార్టీలో చేరుతారని ప్రచారం జరిగింది. సభ ఘనంగా జరిగినా చేరికలు మాత్రం పేలవంగా కనిపించింది. ఒకరిద్దరు ముఖ్య నేతలు తప్ప పేరున్న నేతలు ఎవరూ కనిపిం చలేదు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, వినోద్‌రెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, పలు నియోజకవర్గంలో కొందరు ప్రజా ప్రతినిధులు పార్టీలో చేరారు. వారికి చంద్రబాబు పార్టీ కండు వాలు కప్పి ఆహ్వానించారు. వేమిరెడ్డి దంపతులను కండువా కప్పి ఆహ్వానించారు. ఆయనకు వెంకటేశ్వ రస్వామి ప్రతిమను బహూ కరించారు. చంద్రబాబు మధ్యాహ్నం 12.45 నిమి షాలకు దకా 45 నిమి షాలు మాట్లాడారు .టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మీ, మాజీ మంత్రులు పి.నారాయణ, ఆనం రామ నారా యణరెడ్డి, పరసారత్నం, టి.రమేష్‌రెడ్డి, ఎంఎల్‌ఎలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్ర శేఖర్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు పాశం సునీల్ కుమార్, నెలవల సుబ్రమణ్యం, కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మ య్య నాయుడు, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పార్టీ అభ్య ర్థులు కావ్యకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, నేతలు ఇం టూరు నాగేశ్వరరావు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.




బాబును కలిసి ఆనం రామనారాయణరెడ్డి

విపిఆర్‌పై 'విజయసాయి' బాణం..!

పార్టీ క్యాడర్‌ను కాపాడుకునేందుకేనా - సాయిరెడ్డి చివరి వరకు ఉంటారా?

ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టిడిపిలో చేరడంతో ఆయనపై పార్టీలో నెంబర్ రెండుగా ఉన్న విజయసాయిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ప్రయోగిస్తున్నారు. శనివారం విపిఆర్ టిడిపిలో చేరుతుండడంతో శుక్రవారం రాత్రి ఆఘమేఘాలపై వైసిపి ఎంపి అభ్యర్థి విజయసాయిరెడ్డిగా ప్రకటిం చారు. వేమిరెడ్డితో పార్టీనేతలు, కార్యకర్తలు వెళ్లకుండా కట్టడి చేయడానికి జగన్ వేసిన రాజకీయ ఎత్తుగడగా తెలుస్తోంది. విజయసాయిరెడ్డి జిల్లా వాసి కావడం, పార్టీలో ప్రముఖంగా ఉండడంతో విపిఆర్‌ను ఢీకొట్టడానికి సరైన అభ్యర్థిగా ప్రకటించారని చెబుతున్నా, చివరి వరకు ఆయనే ఉంటారా ? లేదా అనుమానమే..



ఎంపి అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే కందుకూరు ఎంఎల్ఎతో భేటీ అయిన విజయసాయిరెడ్డి, ఆదాల, మంత్రి కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : నెల్లూరు రాజకీయ చరిత్రలో ఇద్దరు పెద్దారెడ్లు పోటీపడడానికి సిద్ధమవుతున్నారు. నిన్నటి వరకు ఇద్దరు సమకాలిక నేతలు. ఇప్పుడు ఇద్దరు రాజకీయ ప్రత్యర్థులుగా మారనున్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసిపి వీడడంతోపాటు, పార్టీని దెబ్బతీయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. తన దారిన తాను వెళ్లకుండా పార్టీలోని ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు .ముఖ్యనేతలను టిడిపిలోకి తీసుకెళ్లడానికి చూస్తున్నారు. దీనిని కట్టడి చేయాలంటే సాధారణ వ్యక్తి సరిపోరని భావించిన ముఖ్యమంత్రి జగన్ తన రాజకీయ వ్యూహానికి పదును పెట్టారు. నెల్లూరు రాజకీయాల్లో కీలకంగా ఉంటూ, పార్టీలో నెంబర్ రెండుగా భావించే విజయసాయిరెడ్డిని నెల్లూరు రాజకీయ రంగంలోకి దింపుతు న్నారు. గెలుపు ఓటములు ఎలా ఉన్నా ముందు పార్టీని కాపాడుకునే పనిలో జగన్ ఉన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్టీని వీడినా వైసిపి ఒక్క నేత కూడా ఆయనపై పన్నెత్తి మాట అనలేదు. ఆయన కూడా ఏమీ మాట్లాకుండా తన పనితాను చేసుకుపోతున్నారు. కందుకూరు ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డిని కలిసి తనతో రావాలని వేమిరెడ్డి కోరిన వెంటనే శనివారం విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి , మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మహీధర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి చర్చలు జరిపారు. పార్టీను వీడవద్దని తాము చూసు కుంటామని చెప్పినట్లు తెలిసింది. దీంతో కొంత మెత్త పడినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాపితంగా నేతలు, కార్య కర్తలను వేమిరెడ్డి వెంట వెళ్లకుండా కట్టడి చేయడానికి విజయ సాయిరెడ్డిని వాడు తున్నారు. జిల్లా వాసి కావడం, ఆర్థికంగా బలంగా ఉండడం, పార్టీలో కీలకమైన వ్యక్తిగా ఉండడంతో విజయసాయిరెడ్డిని నెల్లూరుకు ఎంపిక చేశారని తెలుస్తోంది. ఇది చివరి వరకు ఉంటుందా అంటే అనుమానమే అంటున్నారు. వేమిరెడ్డి తాకిడి తట్టుకోడానికి ఆయనను ఉపయోగిస్తున్నారని, మరో బలమైన అభ్యర్థి వస్తే విజయసాయిరెడ్డి మరోచోటుకు పంపుతారని ప్రచారం సాగుతోంది. నెల్లూరు నగరంలో విజయసాయిరెడ్డి కార్యాలయం కోసం భవనం చూస్తున్నారు. ఇతర ప్రాంతాల్లోనూ ఆఫీసు పెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది అభ్యర్థులను రెండు, మూడు సార్లు మార్పు చేశారు. రాజకీయాల్లో ఎప్పుడు ఏదైనా జరగొచ్చు, ఏం జరుగుతుందో చూడాలి.

నేడు పల్స్‌పోలియో

అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్యాధికారులు



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి -నెల్లూరు : జిల్లా వ్యాప్తంగా 0 నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని గాంధీ బొమ్మ నుంచి వి ఆర్ సి కూడలి వరకు నర్సింగ్ విద్యార్థులతో పల్స్ పోలియో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారం భించారు. డి ఎం అండ్ హెచ్ఓ పెంచలయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాపితంగా 3న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 5.30 లక్షల మంది చిన్నారుల కు పోలియో చుక్కలు వేసేందుకు అని ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. గత 14 ఏళ్లుగా దేశంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈసారి కూడా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ తదితర ఆరు దేశాల్లో పోలియో కేసులు నమోద య్యాయని, ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉండి తమ తమ చిన్నారులకు పోలియో చుక్కలను వేయించడం తమ బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ ఖాదర్ వలీ, పిఎంపి అసోసియేషన్, నర్సింగ్ విద్యార్థినులు, రోటరీ క్లబ్ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : ఉలవపాడు మండలం రామాయపట్నం గ్రామానికి చెందిన రాసాని శ్యామల భర్త రామస్వామి చికిత్సకు సంబంధించి రు.1,54,000, లింగసముద్రానికి చెందిన షేక్ నసీమా చికిత్సకు సంబం ధించి రు.1,20,000 సిఎం సహాయ నిధి ద్వారా ఎంఎల్‌సి తూమాటి మాధవరావు సిఫార్సు చేసి మంజూరు చేయించారు. శనివారం తూమాటి మాధవరావు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎంఎల్‌సి తూమాటి మాధవరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



పోలీసులపై ఈసికి ఫిర్యాదు చేస్తాం..



దివి శివరామ్, మాజీ ఎంఎల్ఎ

ప్రజాశక్తి- కందుకూరు : వైసిపి కందుకూరు నియోజ కవర్గం సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ ను పోలీస్ అధికారులు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో కలవడాన్ని అభ్యంతరం వ్యక్తంచేస్తున్నట్లు కందుకూరు నియోజ కవర్గం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం శనివారం ఒక ప్రకటనలో ఆక్షేపించారు. బుర్రా మధు సూదన్ యాదవ్ కందుకూరు నియోజ కవర్గానికి వైసిపి తరపున ప్రతినిధి మాత్రమేనని, కందుకూరులో బుర్రాకు ఏమి అధికారం ఉందని పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారో నియోజ కవర్గం ప్రజలకు సమాధానం చెప్పాలని శివరాం డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈసికి ఫిర్యాదు చేయనున్నట్లు శివరామ్ మీడియాకు వెల్లడించారు.

నెల్లూరు తరలిన తెలుగు తమ్ముళ్లు



ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు, వారి అనుచరులు శనివారం టిడిపిలో చేరుతున్న సందర్భంగా నెల్లూరులో జరిగే కార్యక్ర మంలో పాల్గొనేం దుకు కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగే శ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్య కర్తలు భారీగా నెల్లూరు వెళ్లారు. కందు కూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు ఉన్నారు.

ఆరోగ్యమిత్ర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

నెల్లూరు : జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీలో ఖాళీగా ఉన్న 18 ఆరోగ్య మిత్రలు పోస్టులు అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసుకొనేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తులు చేసు కోవాలని ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ కర్త డాక్టరు చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు వివరాలకు 9281068169 నెంబర్‌కు సంప్ర దించాలని కోరారు.

నారీ పురస్కారం అవార్డులకు

దరఖాస్తులు ఆహ్వానం

నెల్లూరు : ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పుస్కరించుకొని నెల్లూరు ఏంజెల్స్, జెసిఐ అలుమినిక్లబ్ సంయుక్తంగా నారీపురస్కార్ అవార్డుకార్యక్రమం నిర్వహి స్తున్నట్లు కార్యదర్శి కె. విశ్వమైత్రి పేర్కొన్నారు. ఆదివారం సంతపేట ప్రాంతంలోని సింహపురి హార్డ్‌వేర్స్ షాపులో విలేకర్ల సమావేశం నిర్వహించారు. నారీ పురస్కార్ అవార్డుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వివరాలకు 9391491052 సంప్రదిం చాలన్నారు. కో ఆర్డినేటర్ ప్రసన్న కుమార్, సభ్యులు రమణ్, బిందుమాధవి ఉన్నారు.

కర్లపాలెం నిర్వాసితులకు

పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం విఫలం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు


ప్రజాశక్తి-గుడ్లూరు : మండలంలోని కర్లపాలెం నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోరుతూ శనివారం ఇక్కడ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి, నిర్వాసితుల సంక్షేమ సంఘం నాయకులు జి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింహ రావు మాట్లాడుతూ, 2013 చట్టం ఆధారంగా నిర్వాసితులకు పునరావాసం కల్పించిన తర్వాత మాత్రమే పోర్టు నిర్మించు కోవాలన్నారు. రామాయ పట్నం పోర్టు నిర్మాణం చేపట్టారు గానీ నిర్వాసితులకు పునరావసం కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పోర్టు కోసం అన్ని వదులుకొని త్యాగం చేస్తే వారికి నష్ట పరిహారం చెల్లించడంలో ప్రభుత్వాధి కారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రభుత్వాన్ని తప్పుపట్టారు. ఆరు రోజులు సమ్మె చేస్తే గాని ప్యాకేజీ వచ్చిందంటే దీనిని బట్టి ప్రభుత్వం నిర్వాసితుల పట్ల ఎంత శ్రద్ధ తీసుకుంటుందో అర్థమవుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగం ఇస్తామని చెప్పారు కానీ వాళ్లకి ఇచ్చిన ప్యాకేజీ లోనే జీవితకాలపు కరువు భత్యం లేదా ఉద్యోగం కింద రూ.5 లక్షలు ఇచ్చి పది రూపాయల బాండ్ పేపర్ పై సంతకాలు పెట్టించుకోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్వాసితుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఒక్కొక్క ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆనాటికి 18 సంవత్సరాలు నిండిన బాలికలకు కూడా ప్యాకేజీ ఇస్తామని లిస్టులో పేర్లు వస్తే సుమారు 14 మందికి ప్యాకేజీ ఇవ్వకుండా ఆపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వ చర్యను తప్పుపట్టారు. వెంటనే ఈ 14 మందికి ప్యాకేజీ విడుదల చేయాలని లేకుంటే పోర్టు దగ్గర పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్ కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారందరికీ 2024 ప్రాతిపదిగా నిర్ణయించి వారికి కూడా ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరువు భత్యం కింద రోజుకి వంద రూపాయలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. ఐదేళ్ల పాటు రోజుకు కుటుంబానికి 450 రూపాయలు చొప్పున లెక్క కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జెట్టీలు ఏర్పాటు చేయాలని, శ్మశానాలు ఏర్పాటు చేయాలని, వెంటనే స్థలాలు ఏర్పాటు చేసి ఇవ్వాలని, ఇళ్లకు నష్టపరిహారం చాలా తక్కువగా నిర్ణయించారన్నారు. మరలా రీసర్వే చేసి ఈనాటి రేట్ల ప్రకారం ధర నిర్ణయించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. వెంటనే ప్రభుత్వం కదిలి నిర్వాసితుల సమస్యల పరిష్కారం చేయాలని, లేకుంటే మరోసారి మూడు గ్రామాలు కలిపి ఆందోళనకు పూను కుంటామని మూడు గ్రామాల నాయకులు ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్, కృష్ణపట్నం పోర్టు బాధ్యులు గోగుల శ్రీనివాసులు, సిఐటియు జిల్లా నాయకులు జి. విబి కుమార్, గ్రామ నాయకులు చాపల చిన్న రమణయ్య, చాపల శ్రీను, చాపల శ్రీనివాసులు, చాపల ఏడుకొండలు, చాపల మణికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

పటిష్టంగా విద్యా హక్కు చట్టం అమలు


ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు కెజిబివి కార్యదర్శి డి మధుసూదన్ రావు తెలిపారు. శనివారం నగరానికి వచ్చిన ఆయన జిల్లా విద్యాశాఖ కార్యాల యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది రాష్ట్రంలోని వివిధ ప్రయివేటు పాఠశాలల్లో 50,000 మంది విద్యా ర్థులకు విద్యాహక్కు చట్టం ద్వారా అడ్మిషన్లు కల్పిస్తున్నా మన్నారు. అందుకు సంబంధించి అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అడ్మిషన్లపై ఇప్పటికే జిల్లా విద్యాశాఖ, డిప్యూటీ డిఇఒ, ఎంఇఒ, ప్రధాన ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. మార్చి 5 నుంచి విద్యాహక్కు చట్టానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకొనే సమ యంలో ఇన్‌కం, కుల ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జతచేయాల్సి ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1,20,000లు వరకు పట్టణ ప్రాంతాల్లో రూ.1,42,000ల వరకు ఇన్‌కం సర్టిఫికేట్ తహ శీల్దార్ ధ్రువీకరించబడి సచివాలయాల్లో ద్వారా పొంది ఉండాలన్నారు.ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 శాతం విద్యా హక్కు చట్టం కింద సీట్లు కేటాయించాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 176 సెంటర్లకు సంబంధించి డిపార్ట్మెంట్ ఆఫీసర్లు చీఫ్ సూపరింటెండెంట్ లకు శిక్షణ ఇప్పటికే పూర్తి చేశామన్నారు. 14 సంసాత్మక కేంద్రాలను గుర్తించి ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, ఏపీసి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

'నారాయణ'లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-నెల్లూరు : థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్న ఓ మహిళకు నారాయణ వైద్యశాల జనరల్ సర్జరీ విభాగం వైద్యులు వి.మహిధర్‌రెడ్డి, జి.వి.ప్రకాష్ విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించారు. ఆదివారం నారాయణ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన 7 ఏళ్ల నుంచి బద్వేలు ప్రాంతానికి చెందిన రసూల్బి (43) అనే మహిళ థైరాయిడ్ సమస్యతో బాదపడుతుందన్నారు. సమస్య తీవ్రతరం కావడంతో వైద్యచికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాల జనరల్ సర్జరీ విభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన థైరాయిడ్ విభాగానికి వచ్చిందన్నారు. డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి థైరోటాక్సికోసిస్ గా నిర్ధారించారన్నారు. ఆపరేషన్ చేయాల్సిన అవసరాన్ని రోగి కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. వారి అంగీకారంతో ఆపరేషన్ విజయ వంతంగా నిర్వహించారు. నారాయణ విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టరు పొంగూరు నారా యణ సూచనల మేరకు ఆరోగ్యశ్రీ పథకం వర్తించని రోగులకు నారాయణ ఆరోగ్య మస్తు అనే పథకాన్ని 2014లో ప్రారంభించి గత 10 ఏళ్ల నుంచి సేవలం దిస్తున్నామన్నారు. జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టరు వి. మహిధర్ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టరు వెంకట హరీష్ మాట్లాడుతూ థైరోటాక్సికోసిస్ కారణంగా కళ్లు ముందుకు పొడుచుకొని రావడం, హృద్రోగ సమస్యలు, కిడ్నీ సమస్య ఇలా అనేక రకాల సమస్యలతో ఇబ్బంది పడతారన్నారు. ఆ సమయంలో థైరాయిడ్ గ్రంధి ఎక్కువ హార్మోన్ స్రవించడాన్ని తగ్గించి ఆపరేషన్ చేయకపోతే ప్రాణానికే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఈ సమాచారం రసూల్బి కుటుంబ సభ్యులకు తెలియజేసి యాంటీ థైరాయిడ్ మందులు వాడినప్పటికీ ఫలితం కనిపిం చలేదన్నారు. దీంతో ఆ మహిళను వైద్యశాలలో అడ్మిట్ చేసుకుని అనంతరం ఎండోక్రైనాలజి వైద్యులు డాక్టరు టి. సునంద, డాక్టర్ కశ్యప్ పర్య వేక్షణలో ప్రత్యేకమైన మం దులు తెప్పించి ఆపరేషన్ విజయ వంతంగా నిర్వహించామన్నారు.




మాట్లాడుతున్న వైద్యులు

ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డికి బుజ్జగింపులు

రంగంలోకి దిగిన వైసిపి అగ్రనేతలు

ప్రజాశక్తి-కందుకూరు : వైసిపిపై ఆగ్రహంతో ఉన్న ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డిని బుజ్జగించేందుకు ఆ పార్టీ అగ్ర నాయకులు శనివారం మాచవరం వెళ్లారు. స్వగ్రామమైన మాచవరంలో ఉన్న మహీధర్ రెడ్డిని వారు కలిశారు. శాసనసభ ఎన్నికలకు వైసిపి టికెట్ లభించకపోవడంతో మహీధర్ రెడ్డి ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. తెలుగుదేశంలోకి గానీ, భారతీయ జనతా పార్టీలోకి గానీ వెళ్లి అసెంబ్లీ టికెట్ సాధించుకునేందుకు మహీధర్ రెడ్డి ప్రయత్నిస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వేమిరెడ్డి కలిశారు. సైకిల్, కమలం పార్టీల మధ్య ఎన్నికల పొత్తు కుదిరితే బిజెపిలో చేరి అసెంబ్లీ బరిలో నిలవచ్చునని మహీధర్ రెడ్డి ఆలోచన. మహీధర్ రెడ్డి ప్రయత్నాలు బయట పడడంతో వైసిపి ప్రధాన కార్యదర్శి విజయ సాయిరెడ్డి ,రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తానరావు, ఆదాల ప్రభాకర్ రెడ్డి, బుర్ర మధు సూదన్ యాదవ్ తో కలిసి మాచవరం వెళ్లారు. విజయ్ సాయి రెడ్డి మహీధర్ రెడ్డితో రహస్య మంతనాలు జరిపారని తెలిసింది. వివరాలు తెలియరాలేదు. వైసిపి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా విజయ్ సాయి రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.



మహీధర్ రెడ్డిని కలిసిన వైసిపి అగ్రనేతలు

'ఇంటూరి' ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించడంలో భాగంగా బాబు ష్యూరిటీ –భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని కందుకూరు పట్టణంలోని 31వ వార్డు ఐఎస్ రావు నగర్ లో శనివారం నిర్వహించారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు.మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు కుమారుని అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపటాన్ని ఖండించారు.

9వ వార్డులో ఇంటూరి సతీమణి ప్రచారం


కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య వరుసగా మూడో రోజు పట్టణంలోని 9వ వార్డు ప్రకాశం రెవిన్యూ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, వార్డు మహిళా నాయకులు చెన్నారెడ్డి నరసమ్మ దూదిపల్లి అఖిల, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, అత్తోట మాల్యాద్రి ఉన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఇంటూరి సతీమణి సౌజన్య

కరేడులో 'బుర్రా' సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-ఉలవపాడు : కందుకూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బుర్ర మధుసూదన్ యాదవ్ శనివారం ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఉదయం 10 గంటలకు వైసిపి నేతలు ఆయేకు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత అయిన ఓరుగంటమ్మ గుళ్లో పూజలు నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్ర హానికి పూల మాల నేరిసి నివాళులర్పిం చారు. వైసిపి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామాల సింగారెడ్డి, గంగిరెడ్డి కందుకూరు పట్టణ అధ్యక్షులుషేక్ రఫీ, కరేడు మాజీ సర్పంచి స్వర్ణ పరంధామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సయ్యద్ ఫజులు, మండల కో ఆప్షన్ సభ్యులు ఖాదర్ బాషా, వైసిపి మండల కన్వీనర్ ఎన్.పోతురాజు ఉన్నారు.



చంద్రబాబుకు 'కాకర్ల' పుష్పగుచ్ఛం అందజేత



ప్రజాశక్తి-ఉదయగిరి : టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. శనివారం నెల్లూరు వి.పి.ఆర్ కన్వెన్షన్ సెంటర్లో నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో వేమిరెడ్డి దంపతుల చేరిక సందర్భంగా చంద్రబాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల నుండి తెలుగుదేశం - జనసేన నాయకులు, కార్యకర్తలు అభిమానులు 500కు పైగా కార్లతో భారీ వాహనాల ర్యాలీగా పాల్గొన్నామన్నారు. విపిఆర్ దంపతుల చేరిక పార్టీలో ఉత్సాహాన్ని ఇచ్చిందని నేటి నుండి చేపట్టే కార్యక్రమాలు జనసేన టిడిపి నాయకులు కలిసి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గెలుపే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.

చంద్రబాబును కలిసిన చెంచలబాబుయాదవ్



ప్రజాశక్తి-ఉదయగిరి : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ జెడ్పి చైర్మన్ చెంచలబాబు యాదవ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శనివారం నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరిక సందర్భంగా విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమానంతరం తిరుగు ప్రయాణంలో 'హెలిప్యాడ్' వద్ద మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచలబాబు యాదవ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆయన రాజకీయ భవిష్యత్తుకు తాను భరోసా కల్పిస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా చెంచలబాబు రాబోయే ఎన్నికల్లో టిడిపి ప్రాధాన్యత ఇస్తే తమకు న్యాయం జరుగుతుందని, అది ఒక తెలుగుదేశం పార్టీలో చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

టిడిపిలో వైసిపి నేతల చేరికలు



ప్రజాశక్తి-కావలి : కావలి వైసిపి పార్టీకి గట్టి షాక్ తగిలింది. కావలి పట్టణ వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు షేక్ ప్రసాద్, 40వ వార్డు వైసిపి కన్వీనర్, జెండా చెట్టు ఆహిల్ సున్నత్ మసీదు ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ అన్సర్, సురే శ్రీనివాసులు రెడ్డి, గౌరవరం మాజీ ఎంపిటిసి సురే జయశ్రీ, 26వ వార్డు వైసిపి నాయకులు తదితరులు చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. కావలి అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ప్రజాశక్తి-వరికుంటపాడు : నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ హాల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో వరికుంటపాడు మండలానికి చెందిన పలువురు వైసిపి నాయకులు శనివారం టిడిపిలో చేరారు. వారికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జెడ్‌పిటిసి నాగేంద్ర, వైస్ ఎంపిపి దేవరకొండ మధు, బాల గురువారెడ్డి, గంగవరపు పుల్లయ్య, కామేపల్లి వెంకటరత్నం, మందిరెడ్డి నాగిరెడ్డి, భోగినేని శ్రీనివాసులు, అంద్ర నాగిరెడ్డి, కాలే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన

ప్రజాశక్తి-జలదంకి : జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా శనివారం మైక్ ద్వారా అన్ని గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించినట్లు వైద్య అధికారి డాక్టర్ ఏ శ్రీనివాసులు తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ హరిప్రసాద్, ఆరోగ్య సహాయకులు మస్తాన్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి



ప్రజాశక్తి-కావలి : రెడ్‌క్రాస్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల ప్రారంభోత్సవం శుక్రవారం నిర్వహించారు. సమానత్వం కోసం మహిళల పోరాటం ఏ ఒక్క స్త్రీకాదని లేదా ఏ ఒక్క సంస్థకు చెందినది కాదని మానవ హక్కుల గురించి పట్టించుకునే వారందరి సమిష్టి కృషి సంబంధించిందని రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో విక్రమసింహ విశ్వవిద్యాలయ కళాశాల అధ్యపకురాలు డాక్టర్ మీసాల సుశీల, టీంసేవియర్స్ ప్రతినిధులు కీర్తిప్రియ, తేజస్విని, దివ్యశ్రీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జామున, ఉమాశర్మ తదితరులు మాట్లాడారు. డి.రవిప్రకాష్, కె.హరినారప రెడ్డి, రఘుకుమార్ రెడ్డి, లోకేష్, కృష్ణారెడ్డి, రమన్ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-కావలి : సమాజంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి వినియోగదారులకు రక్షణ కల్పించాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. తూకాల్లో తేడాలు ధరల్లో వ్యత్యాసం కల్తీల జోరు ఎక్కడ చూసినా కనపడుతుందన్నారు. ప్రతీ వినియోగదారుడు నష్టపోయినప్పుడు రసీదు తీసుకొని వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందాలని తెలిపారు. ప్రజలు పౌర సంస్థలు నిరంతరం ప్రజలను చైతన్యపరిచి సమాజంలో కల్తీలు లేని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి చట్టాలను పటిష్టంగా అమలు చేసి వినియోగదారులను రక్షణ కల్పించాలని కోరారు.

పాఠశాలలో తాగునీటి వసతి కల్పన




ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఎంఇఒ కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, స్థానిక ఉపసర్పంచ్ షేక్ మహబూబ్ బాషా దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన స్పందించి విద్యార్థులకు నీటి సదుపాయం కల్పించారు. శనివారం సోమశిల ఉన్నత పాఠశాలకు ఉపసర్పంచ్ మహబూబ్‌బాషా విచ్చేసిన సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో సమస్యలను ఉప సర్పంచ్‌కు ప్రధానోపాధ్యాయులు వివరించారు. పాఠశాల సమస్యలు పరిష్కరిస్తామని ఉప సర్పంచ్ మహబూబ్ బాషా హామీనిచ్చారు.

విద్యార్థులకు బిఎంఆర్ పురస్కారాలు



ప్రజాశక్తి-కావలి : డాక్టర్ లక్ష్మి కృష్ణారావు విశ్వోదయ బాలుర ఉన్నతపాఠశాల, కావలి 65వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడ గౌరవ రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు తన బిఎంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి భార్య బీద మంజులమ్మ పేరుపై గత సంవత్సరం, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో పాఠశాల మొదటి స్థానం పొందిన ఎస్.మహేష్‌కు రూ.7వేలు, రెండోస్థానం పొందిన జి.సుమంత్‌కు రూ.3వేలు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. బిఎంఆర్ ఆఫీస్ సిబ్బంది పి.సుధాకర్, షేక్.బాషా, గోళ్ల మురళిలు, హాజరై, ముఖ్య అతిథులు, కరసాల రోశయ్య, విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ నెల్లూరు, గోవిందయ్య, ఎంఇఒ -1, కావలి, పాఠశాల కరోస్పాండంట్ వై.విజయశంకర్ రెడ్డి, విశ్రాంత, ప్రధానోపా ధ్యాయురాలు సి.శారద, ద్వారకనాథ్‌చౌదరి, (ప్రధానోపాధ్యాయులు) సమక్షంలో అందజేశారు. ఉపాధ్యాయులు, జి.కళ్యాణి, సిహెచ్.బ్రహ్మయ్య సహకారం అందించారు.

భూహక్కు పత్రాలు పంపిణీ



ప్రజాశక్తి-ఉదయగిరి : ఆర్లపడియ పంచాయతీలో అర్హులైన అబ్ధిదారులకు జగన్న భూహక్కు పత్రాలు పట్టాలను సర్పంచ్ ముట్టుకొందు లక్ష్మి నారాయణమ్మ తిరుపతి రెడ్డి పంపిణీ చేశారు. శనివారం మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు పేదలందరికీ ఇళ్లస్థలాల భూహక్కు పత్రాలను ప్రభుత్వ ఆదేశాలు ఎంపిడిఒ సూచనల మేరకే విఆర్‌ఒ మస్తాన్ సమక్షంలో లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. సచివాలయ పరిధిలోని ఆర్లపడియలో 20 లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు అందజేశామన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి రూరల్ : మండల పరిధిలోని ఆముదాలదిన్నె గిరిజన కాలనీలో శనివారం హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్. ఘనీబాషా 100మంది నిరుపేద గిరిజనులకు బిరియాని ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఘనీబాషా మాట్లాడుతూ కావలి పోలీస్ కానిస్టేబుల్ మురళి, అనీల దంపతుల ముద్దుల కుమార్తె ఓన్షితా పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు అన్నదానం నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి, హ్యాపీ సేవా సంస్థ సలహాదారులు చేవూరి ప్రభయ్య, సభ్యులు షేక్ జమీర్, సయ్యద్ నౌషాద్‌అలీ, అంచిపాక హాజరత్తయ్య పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్టంగా ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

త్వరలో జరగనున్న 2024 సార్వత్రిక ఎన్నికలు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పటిష్టంగా చేయాలని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ఉదయగిరి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఈవిఎంలు భద్రపరచడం, ఈవిఎంల స్ట్రాంగ్‌రూమ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల కోసం బీసీ బాలికల వసతి గృహంలోని గదులను కలెక్టర్ పరిశీలించారు. తొలుత తహశీల్దార్ కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయం కోసం ఏర్పాటు చేసిన గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల ముందస్తు ఏర్పాట్లలో భాగంగా భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఈవిఎంల భద్రత, స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, సిబ్బంది శిక్షణ, నామినేషన్ల స్వీకరణకు ఆర్‌ఒ కార్యాలయం ఏర్పాటు, సిబ్బంది వసతి సౌకర్యాలు మొదలైన ఏర్పాట్లను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం దుత్తలూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు మొదలైన అన్ని మౌలిక వసతులను సమకూర్చాలన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటిస్తూ పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమ్ కుమార్, ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, దుత్తలూరు తహశీల్దార్లు నెహ్రూ బాబు, కృష్ణారెడ్డి, కిషోర్ బాబు, యశోద, ఎంఇఒ షేక్ మస్తాన్‌వలీ, ఎన్నికల డిటి రాజు, మండల సర్వేయర్ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

ఐఎఫ్‌పి ప్యానల్స్‌తో బోధన చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

ఐఎఫ్‌పి ప్యానల్స్ ఉపయోగిస్తూ బోధనతోపాటు టోఫెల్ పరీక్షల నిర్వహణ చేయాలని ఎంఇఒ-1 షేక్ మస్తాన్ వలీ శనివారం పేర్కొన్నారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల బిసి ఉర్దూ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి 7, 8 తరగతుల విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్య నైపుణ్యాలను పరిశీలించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఉపయోగిస్తూ విద్యార్థులకు బోధన చేయాలని, టోఫెల్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ జవాబు పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. 8వ తరగతి వారికి ప్రభుత్వ వారు సరఫరా చేసిన ట్యాబ్స్ ప్రతిఒక్క విద్యార్థి ఉపయోగించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు సలహాలు సూచనలు ఇవ్వాలని, లెర్న్ ఎ వర్డ్ ఎ డే క్రమం తప్పకుండా విద్యార్థులకు నేర్పించాలని ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు సూచించి, విద్యార్థుల సామర్థ్యాలు బాగున్నాయని ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలకు సంబంధించి ఏమైనా అవసరాలు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని తెలిపి విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి మధ్యాహ్న భోజనం పరిశీలించి అన్ని రికార్డులను తనిఖీలు చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ షేక్ మస్తాన్‌వలీ

రూ.30వేలు దాతృత్వం



ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలో ఇటీవల మృతి చెందిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత నిత్యాన్నదాత కంచి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దాతృత్వం చేశారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డులోని జెఆర్‌పేటలో ఇటీవల మృతి చెందిన ఇమ్మిడిశెట్టి జనార్ధన్ కుటుంబ సభ్యులను నిత్యాన్నదాత కంచి పరమేశ్వర రెడ్డి పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. 19వ వార్డు పరిధిలోని కొత్త ఆదమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. 16వ వార్డు పరిధిలోని ముస్లీం వీధిలో ఇటీవల మృతి చెందిన ఖాజా రంతుల్లా కుటుంబానికి నిత్య అన్నదాత కంచిపరమేశ్వర్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. నేటి నుండి పట్టణ ప్రజల ఉపయోగార్థం మూడు ఫ్రీజర్ బాక్సులు, ఎఎస్ పేట గ్రామస్తుల కోసం ఒక ఫ్రీజర్‌బాక్స్ మృతి చెందిన వారిని శ్మశాన వాటికకు తరలించేందుకు ఒక వైకుంఠ వాహనాన్ని శనివారం నుండే అందుబాటులోకి ఉంటుందని, ఈ కైలాస రథం ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫ్రీజర్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంచి పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మెప్మా ఆర్‌పిలు రాహిసా బేగం, ఆఫ్రిన్‌లు, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్ రెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్ రెడ్డి, రాంరెడ్డి అశోక్ రెడ్డి, ఇతర ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభకు తరలిన నాయకులు



ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి నియోజవర్గ టిడిపి అభ్యర్థి కాకర్ల చారిటబుల్ ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో మండలం నుండి నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులు భారీ వాహనాలతో ర్యాలీగా నెల్లూరుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ వైసిపి రాజ్యసభ సభ్యులు జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి తెలుగుదేశంపార్టీ కండువాను కప్పేందుకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నెల్లూరు వస్తున్న సందర్భంగా నియోజకవర్గం నుండి వేలాదిగా మండలంలోని పంచాయతీల నుండి వందలాదిగా వాహనాలతో టిడిపి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ హాలులో జరుగు భారీ బహిరంగ సభకు తరలి వెళ్తున్నామన్నరు. కార్యక్రమంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు హరీష్ యాదవ్, జల్సా యాదవ్, మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి

కావలి పురపాలక సంఘ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవ రత్నాలు పథకంలో భాగమైన పేదలందరికీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ దస్తావేజులను శుక్రవారం కావలి ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.ఎ. మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో దేశంలో ఎన్నడూ లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని, ప్రతి పేదవారికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు. కావలిలో సంస్కారానికి అహంకారానికి జరిగే ఈ యుద్ధంలో ప్రజలు సంస్కారవంతులను గెలిపించుకోవాలని కోరారు. ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొట్టే విధంగా అహంకారపూరితమైన వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొడుతున్నారని, అటువంటి వారికి ప్రజలే సరైన గుణపాఠం చెప్పాలన్నారు. కావలిలో రౌడీయిజం చేయాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, రాబోయే ఎన్నికల్లో అటువంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు. అహంకారులను ఓడించి, రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అందజేస్తున్న సంస్కారులైన జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, కావలిలో తనను ఎంఎల్ఏగా గెలిపించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్, సిబ్బంది, వైసిపి పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ కనమర్లపూడి నారాయణ, పందిటి కామరాజు, కనపర్తి రాజశేఖర్, గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరు చిన్నపుల్లయ్య, ముఖ్య నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పట్టాలందజేస్తున్న ఎంఎల్ఎ రామిరెడ్డి

వలంటీర్ల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కావలి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించే వలంటీర్ల సేవలు మరువలేనివని ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంఎల్‌ఎ నివాసంలో కావలి పట్టణ, రూరల్ మండలం వలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహించారు. అత్యుత్తమ సేవలు కనబరిచిన వలంటీర్లకు ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేసే విధంగా వలంటీర్ వ్యవస్థ పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్ వ్యవస్థ ప్రతిష్టంగా అమలవుతుందని ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టాడని తెలిపారు. ముఖ్యంగా కావలి నియోజకవర్గంలో సేవాభావంతో వలంటీర్లు అంకితభావంతో పని చేస్తున్నారన్నారు. అటువంటి వారిని అభినందించడం సంతోషంగా ఉందన్నారు. పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ చేస్తున్న కృషి మరువ లేమన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

వార్డ్ ప్రెసిడెంట్లతో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-కావలి : జనసేన కావలి టౌన్ మున్సిపల్ వార్డ్ ప్రెసిడెంట్‌లతో శనివారం పార్టీ కార్యాలయం లో నియోజక వర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టౌన్ అధ్యక్షుడు పోబ్బా సాయి, అధికార ప్రతినిధి రుషికేశ్, కో ఆర్డినేటర్ సుధీర్ వార్డ్ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. టౌన్ ఉపాధ్యక్షులు నాగార్జున, గాదెంశెట్టి రవి, తోట శరణ్, ఆలా శ్రీనాధ్, మస్తాన్, మురళి, కృష్ణయ్య, జానీ, నాని పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని ప్రయివేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ఉచితంగా ప్రవేశం కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఇఒలు నజీర్ బాషా, చలపతి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లు దారిద్ర్య రేఖకు దిగువ నున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్ఐవి బాధిత పిల్లలకు కేటాయించినట్లు తెలియజేశారు. పూర్తి వివరాలకు ఎంఇఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని మహిమలూరు గ్రామంలో ఆదివారం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఆదివారం డిఆర్‌డిఒ మాజీ చైర్మన్, రక్షణ మంత్రిత్వశాఖ సాంకేతిక సలహాదారు గుండ్రా సతీష్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డితో పాటు జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ మేరకు శనివారం ఏర్పాట్లను గుండ్రా సతీష్ రెడ్డి పర్యవేక్షించారు.

అప్పుల్లో జమవుతున్న విద్యాదీవెన నిధులు

ప్రజాశక్తి-కావలి

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన నుంచి వచ్చే నిధులు తల్లి అకౌంట్‌లలో వేయవద్దని, అవి తల్లి అకౌంట్‌లో పడటం వల్ల బ్యాంక్‌ల వారు తల్లిదండ్రులు అప్పులు ఉన్నారని జమ చేసుకుంటున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి తెలిపారు. శనివారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్‌డిఒ శీనానాయక్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ సర్వీస్ ఛార్జీల కింద బ్యాంక్‌ల్లో డబ్బులు జమ చేసుకుంటున్నారని తెలిపారు. మేనేజ్‌మెంట్ వారు ఎస్‌సి ఎస్‌టి విద్యార్థులకు హాల్ టిక్కెట్‌లు ఇవ్వడం లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ బద్ధంగా కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం మొత్తం కలిపి స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. దాంతో దళిత గిరిజనులకు నష్టం జరుగుతుందన్నారు. ప్రొఫెషనల్ కోర్సులు, బిటెక్, ఎంటెక్, బిఫార్మసీ విద్యార్థులు డబ్బులు పడకపోవడం వల్ల మళ్లీ అప్పులు చేసి యాజమాన్యానికి డబ్బులు కట్టాల్సి వస్తుందన్నారు. తల్లి అకౌంట్‌లలో వేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాజ్యాంగ బద్ధంగా ఎస్‌సి ఎస్‌టి విద్యార్థులకు వచ్చే స్కాలర్‌షిప్‌లు అందరికి కలిపి వేయడం వల్ల ఎస్‌సి ఎస్‌టిలకు నష్టం జరుగుతుందన్నారు. అనేక వసతి గృహాలలో కూడా భోజనం సరిగా పెట్టడం లేదన్నారు. కూలి చేసుకొనే వారు వారి పిల్లలను చదివించుకోవడం కష్టంగా ఉందన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు విడిగా వేయాలని తెలియజేశారు. వసతిదీవెన, విద్యా దీవెనలలో కలపవద్దని తెలిపారు. జరుగుమల్లి విజయరత్నం, జెడ్డా వాసు, ఆలూరి బ్రహ్మయ్య, రమేష్, చౌటూరి రవి తదితరులున్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘర్షణ సమితి నాయకులు

రైతులకు సూచనలు

ప్రజాశక్తి-కలిగిరి : పంటకోత ప్రయోజనాలు ద్వారా పంటల దోపిడీ అంచనా వేసి తద్వారా బీమా వర్తిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి సూచించారు. శనివారం అనంతపురం రైతులతో ఆమె మాట్లాడుతూ శనగ పంటల్లో పంటకోత ప్రయోజనాలను ఆమె పరిశీలించారు. ఎడిఎ నర్సరావు, కలిగిరి ఎఒ సురేష్ బాబు, డివైస్ ఒ.సీనయ్య, ఎస్ఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లా టిడిపిలో నూతనోత్సాహం

ప్రజాశక్తి-నెల్లూరు

రాజ్యసభ సభ్యుడిగా, జిల్లాలో వైసిపికి పెద్ద దిక్కుగా ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆ పార్టీ అధ్యక్ష పదవికి, ఎంపి సభ్యత్వానికి రాజీనామా చేసి టిడిపి కండువా కప్పుకున్నారు. అదే సమయంలో జిల్లాలోని వైసిపి పార్టీకి చెందిన పలువురు ప్రధాన నాయకులను, కార్పొరేటర్లను, జడ్‌పిటిసి, ఎంపిటిసి, దేవాలయాల కమిటీ సభ్యులను ఆ పార్టీకి రాజీనామా చేయించి తనవెంట తెలుగుదేశం పార్టీలోకి తీసుకెళ్లారు. కనపర్తిపాడు ప్రాంతంలోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో టిడిపి ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి భారీ ఎత్తున తన అభిమాన జనసమీకరణను టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎదుట ప్రదర్శించారు. జిల్లా పార్లమెంట్ స్థానానికి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆ పార్టీ అధినాయకుడు ఎవరిని ఎంపిక చేసినా.. వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపించకపోవడంతో విధిలేని పక్షంలో, బలవంతంగా విజయసాయిరెడ్డిని పార్లమెంట్ సమన్వయకర్తగా ఎంపిక చేస్తూ ప్రకటన విడుదల చేశారు. వైసిపి పార్టీని వీడిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తనదైన శైలిలో జిల్లాలోని టిడిపి నాయకులను, వైసిపిపై ఆలకబూని ఉన్న నాయకులను, మధ్యస్థంగా ఉన్న నాయకులను నేరుగా కలిసి మంతనాలు సాగించారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలింపును వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు జిల్లాలో దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నాయి. కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు హాజరై రాష్ట్ర ప్రభుత్వం జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి పాలన కొనసాగించడం లేదని, కేవలం కార్పొరేట్ శక్తి అయిన అదాని అభివృద్ధికి మాత్రమే పనిచేస్తుందని విమర్శలు గుప్పించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నగరంలో నేరాల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో హత్యలు పెరిగిపోతున్నాయి. నేరాలు కట్టడి చేయడంలో పోలీసులు పూర్తి స్థాయిలో వైఫల్యం చెందుతున్నారని ప్రజలు వాపోతున్నారు. నెలవారీ సమీక్షా సమావేశాలు నిర్వహించుకోవడం తప్ప ఆకతాయిల ఆగడాలకు పోలీసులు అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నగరంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రదర్శనలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇంటర్ పరీక్షలు గట్టి పోలీసు బందోబస్తుల నడుమ జిల్లా అధికారులు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికార పార్టీ వైసిపి సిద్ధం పేరుతో నిర్వహిస్తున్న సభలకు ప్రజలను తరలించేందుకు ఆర్‌టిసి బస్సులను వినియోగించు కుంటుంది. గ్రామీణ ప్రాంతాలకు తిరుగుతున్న ఆర్‌టిసి బస్సులను ముందస్తు సమాచారం లేకుండా అధికారులు సిద్ధం సభా నిర్వహణకు కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఆర్‌టిసి అధికా రులు ఇటువంటి నిర్ణయం తీసుకోవడం వల్ల విద్యార్థులు సైతం ఇబ్బంది పడుతున్నారు.

దీ క్ష ణం

పోలియో చుక్కలకు సహకరించాలి

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం పల్స్ పోలియోకు సంబంధించి వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులతో ఇనమడుగు పురవీధుల్లో ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఇందుకు తల్లిద ండ్రులు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో పోలియో చుక్కలు వేస్తారన్నారు. మొత్తం మండలంలో 7408 మంది చిన్నారులకు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించా మన్నారు. మండలంలో 70 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి 7 రూట్లుగా విభజించామన్నారు.ఒక మొబైల్ టీమ్ మండలంలో తిరుగుతూ ఉంటుందన్నారు. ఏ కారణం చేతనైనా ఆదివారం పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులకు మార్చి 4,5,6 తేదీల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఈ పోలియో చుక్కలను వేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజాశక్తి-సంగం

సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం డాక్టర్ అశోక్‌కుమార్ పల్స్ పోలియో అవగాహన ర్యాలీను నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. పోలియో చుక్కలు వేయించుకోవాలంటూ నినాదాలు చేశారు. 0-5 సంవత్సరాల చిన్నారులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. మండలంలో 3543మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. 42కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మళ్లదిబ్బలో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో గతంలో కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి రావడం, ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి 400 పైగా కోళ్లను తీసుకువచ్చి ఖననం చేయడం విధితమే. ఈ మేరకు శనివారం పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మహేశ్వరుడు ఆదేశాల మేరకు కోవూరు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కష్ణమౌర్య సూచనలతో పశు సంవర్ధక శాఖ



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

అధికారుల బృందం శనివారం గుమ్మళ్లదిబ్బ గ్రామంలో ఇంటింటికి వెళ్లి కోళ్ల విషయమై తనిఖీలు చేపట్టారు. ప్రతి ఇంట్లో ఇంకా ఏ మైనా కోళ్లు ఉన్నాయా అనే విషయాలను కూడా ఈ బృందం సభ్యులు డాక్టర్ షబానా, డాక్టర్ ప్రీతి సాల్మన్, జేవీఏ ఆరిఫ్ నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కష్ణమౌర్య మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిన ఈ గుమ్మళ్లదిబ్బ గ్రామంలో మూడు నెలల పాటు చికెన్, కోడిగుడ్ల అమ్మకాలు చేయరాదన్నారు. ఈ మేరకు ఈ గ్రామంలో ప్రత్యేక తనిఖీలు చేపడతామన్నారు. ఇందుకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు.

ధైర్యంగా నారాయణ నిలబడ్డాడు..

వైసిపి నేతలు ఎన్నో ఇబ్బందులు పెట్టారు

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ హాల్ లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు టీడీపీలో చేరిక సందర్భంగా భారీ కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హాజరయ్యారు. చంద్రబాబుకు వీపీఆర్‌తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ టీడీపీ అగ్రనాయకులతో కలిసి ఘనస్వాగతం పలికారు. సభావేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పలు అంశాలపై మాట్లాడారు. ఈ క్రమంలో మాజీ మంత్రి, నెల్లూరు నగర సిటీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ గురించి ఆయన ప్రస్తావించారు. మదుస్భా వి అయిన నారాయణ లాంటి వ్యక్తిని వైసీపీ నాయకులు ఎన్ని ఇబ్బందులు పెడుతున్నారో మీరందరూ చూస్తున్నా న్నారు.నారాయణ కూడా అందుకు ధీటుగా ఒకటే ఆలోచించారని చెప్పారు. తాను ఏ తప్పు చేయను.. చేయబోను... తాను పోరాడుతూనే ఉంటానని ధైర్యంగా నిలబడిన వ్యక్తి నారాయణ అని కొనియాడారు. ఎవరేమి చేసుకున్నా ప్రజాసంక్షేమం, నెల్లూరు అభివద్ధే ధ్యేయంగా ముందుకెళుతున్నారని ప్రశంసిం చారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి నారాయణను గెలిపించుకుని వారందరికీ తగిన బుద్ధి చెప్పాలన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన




ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కప్పరాలతిప్ప, కొండ బిట్రగుంట గ్రామంలో సూపర్‌వైజర్ వాకాటి కోటేశ్వరి ఆధ్వర్యంలో ఎం.చిరంజీవి కళాజాత బృందం రవితేజ, శారద, వరప్రసాద్ వారితో బాల్యవివాహాల నివారణపై శనివారం సాంస్కృతిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వాకాటి కోటేశ్వరి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని జరిపిన, వాటిని ప్రోత్సహించిన కఠినమైన చర్యలు తప్పవని తెలిపారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం జరపాలని, అలా జరగకపోతే ఆడపిల్లకు ఆరోగ్యపైన సమస్యలు తలెత్తుతాయని, పుట్టబోయే బిడ్డలకు కూడా అనారోగ్య సమస్యలు తలెత్తు తాయని తెలిపారు. ఆడపిల్లల విషయంలో తల్లిదండ్రులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎం.చిరంజీవి కళాజాత బృందం, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

ఎఎస్‌పేటకు ఫ్రీజర్ అందజేత

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: ఎఎస్‌పేట పంచాయతీకి ఆత్మకూరుకు చెందిన శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్ రెడ్డి తన సొంత నిధులతో శనివారం ఫ్రీజర్‌ను అందజేశారు. గత రెండు నెలల క్రితం ఎఎస్‌పేట సర్పంచ్ షేక్ జిలాని భాషా గ్రామస్తులతో కలసి ఎఎస్‌పేటకు ఫ్రీజర్‌ను అందజేయాలని కంచి పరమేశ్వర్ రెడ్డిని కోరడంతో వెంటనే స్పందించిన ఆయన ఫ్రీజర్‌ను ఎఎస్‌పేటకు తీసుకువచ్చి బహూకరించారు. ఈ మేరకు ఎఎస్‌పేట గ్రామస్తుల తరపున కంచి పరమేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనవెంట కుడుముల సుధాకర్ రెడ్డి, రాంపల్లి ప్రసాద్ రెడ్డి, శేషారెడ్డి, ఎఎస్‌పేట గ్రామస్తులు నీలం గోవిందయ్య, సీనయ్య, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.



డయాలసిస్ పెన్షన్ అందజేత

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన షేక్ కాజాబీకి ప్రభుత్వం ద్వారా అందించే డయాలసిస్ పెన్షన్ రూ.10వేల నగదును శనివారం వెల్ఫేర్ అసిస్టెంట్ రాజు, సర్పంచ్ భర్త మేడిద వెంకటేష్ చేతుల మీదుగా అందించారు. కాజాబీ గత రెండు నెలలుగా బాధపడుతుంది. ఈ మేరకు ఆమెకు ప్రభుత్వం ద్వారా పెన్షన్ ఇప్పించి అందజేశారు.

మూడు చోట్లచోరీలు

ప్రజాశక్తి-సంగం: మండలంలోని సిద్దీపురం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఒకేసారి మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది. షేక్ మాబూజ, షేక్ మస్తాన్ సాహెబ్, శ్రీహరి అనే వారి ఇళ్లల్లో దుండగులు చోరీ చేశారు. వివరాల మేరకు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి రూ.57వేల నగదు, ముక్కాల సవర బంగారం చోరీ చేశారు. ఉదయాన్నే ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జున రెడ్డి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-కోవూరు: కోవూరులోని టివిఎస్ కళాశాలలో శనివారం ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం ఈ పరీక్షలకు 336 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల అధికారి షఫియా భాను తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాన్ని కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ ప్రాంతంలో 144 సెక్షన్ విధించినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

టిడిపి అభ్యర్థుల విజయానికి కృషి

ప్రజాశక్తి-సీతారామపురం: రానున్న 2024 సార్వత్రిక ఎన్నికలలో జిల్లాలో టిడిపి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని టిడిపి జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారని టిడిపి జిల్లా మహిళా విభాగ అధికార ప్రతినిధి, సీతారామపురం జెడ్‌పిటిసి కలివెల జ్యోతి పేర్కొన్నారు. శనివారం నెల్లూరులో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరై మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి కొద్దిసేపు చర్చించారు.

'చలో నెల్లూరు'కు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం టిడిపి నాయకులు నెల్లూరు వి పి ఆర్ కన్వర్షన్ నందు వైసిపి నేత వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో టిడిపిలో చేరుతున్న సందర్భంగా నెల్లూరులో నిర్వహిస్తున్న సభకు బోగోలు మండలం నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బోగోలు మండల నుండి పెద్దసంఖ్యలో పాల్గొన్న వారి వాహనాలకు టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాలేపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబునాయుడు పాలన కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని రానున్న ఎన్నికల్లో జగన్ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఎల్ సుధీర్ బాబు, ఎల్ మాధవరావు, కాంట్రా రఘురాం నాయుడు, ఎన్నా బత్తిన వెంకటేశ్వర్లు, రాయి విజయ్ యాదవ్, దొడ్డ అంజయ్య యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, ఆవుల సురేష్, సన్యాసి శ్రీధర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రం వద్ద ఉన్న సిఐ

పరీక్ష కేంద్రంలో సిఐ పరిశీలన

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా కేంద్రాన్ని శనివారం కావలి రూరల్ సిఐ నాగభూషణం పరిశీలించి కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐ నాగభూషణం మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు సందర్భంగా కప్పరాల తిప్పలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించామని, కళాశాలలోని విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాస్తున్నారని ఇసంతరంగా పరీక్ష కేంద్రాల్లోని తరగతులను పరిశీలించామని, కళాశాల వద్ద ఎటువంటి ఇబ్బందులు జరిగిన వెంటనే పోలీస్ సిబ్బందికి తెలపాలని సూచించామన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సుధాకర్, బిట్రగుంట పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

టిడిపిలోకి మాజీ ఎంపిపిలు

ప్రజాశక్తి-సీతారామపురం : సీతారామపురం మండలంలో వైసిపికి గట్టి ఎదురుదెబ్బ తగిలిందనే చెప్పుకోవాలి. సీతారామపురం మాజీ ఎంపిపిలు కల్లూరి జనార్ధన్ రెడ్డి, నేలటూరి అబ్రహాంలు మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. శనివారం నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్లో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు టిడిపి చేరిక అనంతరం సీతారామపురం మాజీ ఎంపిపిలు కల్లూరి జనార్ధన్ రెడ్డి, నేలటూరి అబ్రహంలకు టిడిపి కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపిలు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వెంటే తమ పయనం ఉంటుందని ఉదయగిరి నియోజకవర్గంలో టిడిపికి అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పనిచేస్తామని వారు తెలిపారు.

దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-అనంతసాగరం: బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 12(1)(సి)ప్రకారం 2024-25విద్యా సంవత్సరానికి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25శాతం ఉచిత ప్రవేశాలు పొందడానికి దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంఇఒ బాలకృష్ణా రెడ్డి తెలియజేశారు. పూర్తి చేసిన ధరఖాస్తులను మార్చి 3నుండి 14లోపు సచివాలయం లేదా నెట్ సెంటర్, మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుండి ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. షెడ్యూల్ తరగతులకు 10శాతం, షెడ్యూల్ తెగలకు 4శాతం, వెనుకబడిన తరగతులు, మైనారిటీలకు 6శాతం, అనాథలు, హెచ్ఐవి బాధితులు, విభిన్న ప్రతిభావంతులకు 5శాతం కేటాయించారన్నారు. దరఖాస్తులు చేసుకొనువారు ఆధార్, కులం, ఆదాయం, రేషన్ కార్డు, పాస్ ఫోటోలు తప్పనిసరి అన్నారు. గ్రామీణ ప్రాంతం వారి వార్షికాదాయం రూ.1,20000, పట్టణ ప్రాంతం వారు రూ.1,40000ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 14417 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.